International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-4(1), April, 2017
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

# ఆధునిక కవుల భావనలో మాతృమూర్తి

బొడ్డు విజయ భారతి,
మహారాజ అటానమస్ కళాశాల,
విజయనగరం.

కుటుంబ జీవిత నాటకంలో అమ్మది ఒక ముఖ్యమైన పాత్ర. ప్రియురాలిగా భర్తకి సేవలందించటమేకాదు, ఇల్లాలుగా వంశాభివృద్ధి చేయుడంలోనూ, తల్లిగా పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా, విద్యావంతులుగా, పనిమంతులుగా సంపూర్ణ మూర్తిమత్త్వం కలిగిన యెగ్యులుగా తీర్చిదిద్దడంలోనూ గణనీయమైన సేవలందిస్తుంది.

ఏదో కొద్దిమంది ఐశ్వర్యవంతులైన తల్లులు జనజీవన స్రవంతిలో తల్లులైన ప్రతి స్త్రీమూర్తి పిల్లల కోసం అహర్నిశలు గనిలో, వనిలో, కార్ఖానాల్లో, వ్యవసాయక్షేత్రాల్లో సహస్ర విధాలుగా కష్టించి శ్రమించి పిల్లలను పెంచుకుంటున్నారు. మహాసౌందర్య భరితమైన మానవ విశ్వంలో అమ్మ శ్రమ సంస్కృతికి ప్రాణంగా చెప్పబడుతుంది. ఇంట్లో, వంటింట్లో, బయట పనులు చేస్తూ అమ్మ మానవ జాతి నిర్మాణంలో, మన దేశ ప్రగతిలో సమసమాజ కళ్యాణంలో ఆజన్మాంతం సేవలు అందిస్తూ క్రమశిక్షణ గల సైనికురాలుగా ప్రగతి పథాన ముందుకు సాగిపోతుంది. దేశమాత నుదిటి మీద స్వేద బిందువుల్లో తడిసిన రక్తసింధూరంలా అమ్మ ప్రకాశిస్తుంది.

పిల్లలు ప్రగతికోసం చేసే ప్రయత్నంలోనూ అమ్మ ఎన్నో సాహసోపేతమైన సంఘటనలు ఎదుర్కొంటుంది. అమ్మ శ్రమ జీవితంలో ఎన్నో కోణాలు ఎన్నో ఒడుదుడుకులు ఎన్నో ఎత్తు పల్లాలు, ఎన్నో పోరాటాలు, ఎన్నో అవమానాలు, ఎన్నో ముళ్లబాటలు, పూలదారులు, ఎన్నో నిశిరాత్రులు, ఎన్నో శారదరాత్రులు, ఎన్నో ఆశల జలపాతాలు, ఎన్నో విజయాలు. పిల్లల జీవితానికి దిశానిర్దేశం చేయడంలో తల్లియొక్క తపన, దీక్ష, పట్టుదల, మాటలకందనంతటి మహోన్నతమైనవి.

ప్రతి మగాడి విజయం వెనుక ఒక ఆడది ఉంటుందంటారు. కాని దాని కంటే ముందు చెప్పవలసినది ప్రతి మనిషి విజయం వెనుక తల్లి కృషి, శ్రమ, లక్ష్యం, రూపకల్పన ఉండడమే కాదు ఉండి తీరుతుందని ఘంటాపథంగా చెప్పవచ్చు. మహోన్నతమైన శ్రమజీవి తల్లిని స్మరిస్తూ, ఎందరో ఆధునిక కవులు కీర్తించారు.

ఈ భూమ్మీద మహాసౌందర్యవంతమైన మానవ విశ్వంగా అమ్మను అద్భుతమైన భావన చేశారు జయధీర్‌గారు. ఇంతటి అందమైన మానవ విశ్వం రూపొందడానికి మూలకారణం అమ్మ. ఆమె సంతానోత్పత్తి చేయడం వలన మానవ విశ్వం వికసిస్తుంది. అమ్మ శ్రమించడం వలన మనం సుఖశాంతులతో జీవిస్తున్నాం. ఇదే విషయాన్ని లోతులకు వెళ్ళి పరిశీలించడం జరిగింది.

తరతరాల మానవ జీవిత చరిత్రలో అమ్మ మూర్తీభవించిన శ్రమకు ప్రతి రూపంగా కనిపిస్తుంది. అమ్మ పిల్లల కోసం, కుటుంబం కోసం, వారి అభివృద్ధి కోసం పరిభ్రమిస్తుంది. భూమాత సూర్యుని చుట్టూ పరిభ్రమించడం వలన పగలు, రాత్రులు, రుతువులు ఏర్పడుతున్నాయి. అమ్మ పరిశ్రమించడం వలన మానవ విశ్వానికి వికాసం అభివృద్ధి చెందుతుంది. మానవ విశ్వం సర్వతోముఖ వికాసానికి అమ్మ శ్రమ మూలకారణభూతమౌతుంది. అణువణువున పని సంస్కృతి పల్లవించిన తల్లి జీవిత చరిత్రను వర్ణించారు జయధీర్‌గారు.

అమ్మ రాత్రి పగలు, పనిచేయడం వలన ఎంతో కష్టానికి, శ్రమకి గురౌతుంది. ఉదయాన్నే ప్రతి రోజు అమ్మ పప్పు రుబ్బడమూ, పిండి విసరడమూ, బియ్యం దంచడమూ, వంటలు చేయడమూ, బట్టలు ఉతకడం చేస్తుంది. ఇలా నానా గొడ్డు చాకిరీ చేయడం వలన అమ్మ చేతులు నలిగిపోయి కందిపోయి ఎరుపెక్కిన ఎర్రని సూర్యునిలా కనిపిస్తున్నాయి. అలా ఎరుపెక్కి పొక్కులెక్కిన అమ్మ అరచేతిలో సూర్యుడు బందీ అయినట్లు కనిపిస్తుంది. ఇరవై నాలుగు గంటలూ ఇంటిపని, వంటపని చేయడం వలన ఇల్లు వత్తడంవలన పిడచకట్టి జీర్ణవస్త్రంలా శరీరం తయారయ్యింది. అమ్మ శ్రమ అనే వెన్నెలను మనకి ధారపోసి తాను మాత్రంశూన్యం నిండిన నల్లని గ్రహంలా మారిపోతుంది.

అమ్మ జీవన పోరాటంలో తన భర్తతో పాటు శ్రమిస్తుంది. భర్తలేనప్పుడు కూడా తాను ఒంటరిగా శ్రమిస్తుంది. జీవన పోరాటంలో చెమటను చిందించి రక్తాన్ని ఆవిరిగా మార్చుతుంది. ఇంటా బయటా శ్రమించి ఆవిరైపోతున్న సజీవావరణంలా ఆవిరైపోతుంది అమ్మ అంటారు జయధీర్‌గారు.

చేసి చేసి అలసిన
ఆమె రెండు అరచేతుల్లో
ఒక సూర్యుడు బంధీ అయ్యాడు
ఎర్రబారి కమిలిపోయాడు పాపం

బతుకు బండిని లాగే ఎద్దుల్లో ఒక ఎద్దు అమ్మ అయితే రెండో ఎద్దు నాన్న. వీరిద్దరూ బతుకు బండిని సక్రమంగా లాగడం వలన కుటుంబం సజావుగా సాగుతుంది. అయితే ఒక్కొక్కసారి అమ్మగారే ఒంటెద్దై బతుకు బండిని లాగి అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది.

ఆనందాల్ని పంచుకోవడానికి అందరూ ముందుంటారు గాని కష్టాలు మాత్రం పంచుకోవడానికి ముందుండేది ఒక్క అమ్మ మాత్రమే. కుటుంబం కోసం పిల్లల కోసం ఎన్నో పనులు చేసి ఎంతో చాకిరీ చేసి ఎన్నో బరువు బాధ్యతలు భరిస్తుంది. అదేం చిత్రమో గాని మానవుల్లోనే కాదు పక్షుల్లోనూ, జంతువుల్లో కూడా అమ్మ మాత్రమే పిల్లల బరువు బాధ్యతలను

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-4(1), April, 2017
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

కష్టసుఖాలను చూస్తుంది. పిల్లలకి రెక్కలొచ్చి వాళ్ళు తమ కాళ్ళమీద తాము నిలబడే వరకూ కంటికి రెప్పలా అమ్మ కాపాడుతుంది. ఈ ప్రయత్నంలో అమ్మ కమిలి పోతుంది, కందిపోతుంది. ఇల్లు శుభ్రపరిచే పిడచగట్టిన గుడ్డలా తయారవుతుంది. తన పిల్లల జీవితంలో వెన్నెల వెలుగును ధారపోసి తాను మాత్రం చీకటి గ్రహంలా మిగిలిపోతుందని తన అమ్మ శ్రమను వేనోళ్ళ కీర్తించారు ఇక్కడ.

అది నా తల్లి
మట్టెలున్నప్పుడూ లేనప్పుడూ
రాలే టకటకల చెమట చుక్కలు
గుడిసెల్లో శ్రమక్షేత్రాల్లో
ఆవిరవుతున్న సజీవావరణం

అమ్మ లేకుంటే ఈ జగతి శూన్యంగా మిగిలిపోతుంది. అమ్మ శ్రమించకుంటే ఈ మానవ ప్రగతి కుంటుపడిపోతుంది. ఇంతటి మహోన్నతురాలైన తల్లి శ్రమను చూడలేని కన్నపిల్లలను చూసి పరితపిస్తున్నాడు కవి.

అమ్మ ప్రతిరోజు ఇంటిలో అందరికంటే ముందుగా బ్రహ్మీముహూర్తంలో ప్రభాత సమయంలో నాలుగు గంటలకే మేల్కొంటుంది. నియమం తప్పకుండా కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసుకొని పూజ పునస్కారాలు ముగించుకొని క్రమశిక్షణకు మారుపేరైన తల్లి విసుగు విరామం లేకుండా చక్కగా పనులు చేసుకుంటూ పోతుంది. వయసు పైబడినప్పటికి ఎనిమిది పదులు నిండినప్పటికి కష్టం అని గాని నీరసం అని గాని ఎవరికీ చెప్పదు. ఇంటిలో వంటా వార్పులు చేస్తూ చక్కని రుచులతో ఆహారాన్ని అందిస్తుంది. అలాంటి క్రమశిక్షణ తల్లి యొక్క జీవనశైలి నేటి తరం వారికి కొంతైనా అబ్బలేదు ఇది చాలా అవసరం. ఆది వారం అని గాని అస్వస్థత అని గాని ఎంచకుండా చక్కగా పనిచేస్తున్న అమ్మ త్యాగం అమృత త్వాన్ని పొందింది. ఇలాంటి అమ్మ శ్రమ సంస్కృతికి ప్రాణం అంటారు గరికిపాటివారు అమ్మ గురించిన తన ఆధునిక పద్యకవితలో.

నీ పని నీవు చేసుకొను నీమము తప్పవు, కోడలైన ని
న్నాపగలేదు, నీ దగు మహా క్రమశిక్షణ సుంతమైనా మా
దాపునకైన రాదు, బహుధా తపియించెడి వేళనైన తా
సోపశమంబు కోరవు, మహోన్నత నిగ్రహ విగ్రహంబవో

ప్రభాత సంధ్యలో చల్లని వాతావరణంలో దైవ ప్రార్థనతో దైనందిన కార్యక్రమాలు ప్రారంభించడం అమ్మకు వెన్నతో పెట్టిన విద్య. ఎవరిమీద ఆధారపడకుండా తన

రెక్కలాడినంతవరకు తనపని తాను చేసుకుంటూ ఇంటిల్లిపాదికి ఇతోధికంగా సేవలందిస్తుంది. తన ఊపిరాడినంతవరకు యథాశక్తి కృషి చేస్తుంది. వయోభారం పైబడినప్పటికీ జీవిత చరమాంకంలో సైతం అమ్మ విశేషమైన అనుభవాన్ని అపారమైన జ్ఞానాన్ని బోధిస్తుంది.

పిల్లల పెంపకంలోను ఇల్లును చక్కగా సుందరంగా తీర్చిదిద్దడంలోనూ అతిథి అభ్యాగతులను ఆదరించడంలోనూ ఆచార వ్యవహారాల్లోను సంస్కృతి సాంప్రదాయాల్లోనూ పెళ్ళి పేరంటాల్లోనూ పండగ పబ్బాల్లోనూ అమ్మ కోడళ్ళకీ కూతుళ్ళకి తన మనవడు, మనవరాళ్ళకీ అపారమైన అనుభవాల విజ్ఞాన సర్వస్వంగా సందేహాలను తీరుస్తూ సంపూర్ణజ్ఞానాన్ని అందిస్తుంది. ఇంట్లో అందరమూ ఉంటాంకాని ఇల్లును జాగ్రత్తగా చూసేది అమ్మ మాత్రమే పెద్దరికమంటే అధికార దర్పాన్ని చూపించడం కాదు గర్వంతో విర్రవీగడం కాదు. ఇంటికి కుటుంబానికి ఏ ఆపదలూ రాకుండా చూడడం, అంతే కాదు పదిమందిలో కుటుంబం నవ్వులపాలు కాకుండా బతకడం, కాపురాన్ని పచ్చని కాపురంగా చక్కదిద్దడం, ఎన్నో పనుల్లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ తెలివిగా సాగుతుంది అమ్మ. తన బొందిలో ప్రాణమున్నంతవరకూ తాను ముందుండి ఇంటిని నడిపిస్తుంది. తాను వెలుగై ఇంటిలో చీకటిని తొలగిస్తుంది.

పిల్లలను చక్కగా చక్కదిద్ది ప్రయోజకులుగా చేయాలనే తపన కుటుంబాన్ని ఆరోగ్యంగా బలంగా పెంచాలనే దీక్ష నలుగురిలో సగర్వంగా తలెత్తుకొని తిరిగేలా కుటుంబాన్ని రూపొందించడంలో మహాభారత యుద్ధంలో పార్థునికి రథసారధ్యం వహించి విజయాన్ని చేకూర్చిన శ్రీ కృష్ణుడిలా అమ్మ ఇంటికి కుటుంబానికి సారథ్యం వహించి చాకచక్యంగా విజయ పథంలో నడిపిస్తుంది. అమ్మ కార్యసాధనకోసం తొలికోడి కూతకుముందు గాని వేగు చుక్కకి వెనుకగా గాని మేల్కొంటుంది.

అమ్మ నిద్ర పోలేని బతుకు రెక్కల మోతను ఇల్లంతా మార్మోగిస్తుంది. ఆ అలికిడిని లమ్మ యొక్క పనులను మూసిన కళ్ళతో గమనిస్తూ ఉంటాను. లమ్మ లటకమీదకి ఎక్కుతూ సామానులు సర్దుతూ అంట్లు తోముతూ పచ్చడిరుబ్బుతూ అట్లు కాలుస్తూ వంటకోసం మంట మండిస్తూ వంటచేసి మంటలు ఆర్పుతూ ఎన్నో పనులు చకచకా చేస్తూ ఉంటుంది. నేను మాత్రం కాలుముడుచుకొని నిద్రపోతాను. నన్ను లేపడానికి అమ్మ పెదాల లిపికి అందని బాషలో ఆప్యాయంగా మాట్లాడుతాయి.

అమ్మ శ్రమలో కొద్దిగానైనా పనిచేసి, ఆమె పనిపాటుల్లో పదిపైసలు వాటా అయినా పాలుపంచుకుందాం అనుకుంటాను. కాని అమ్మ ప్రేమ సామ్రాజ్యంలో ఉన్న నేను రాజకుమారుడిలా మరల నిద్రలోకి జారుకుంటాను. నన్ను మేల్కొపడానికి అమ్మ వేళ్ళు సుతిమెత్తగా నన్ను స్పృశించి నప్పుడు నేను నిద్రనుండి మేల్కొని ఆహార్యం ధరించిన సూర్యునిలా జీవిత నటనాలయంలోనికి ప్రవేశిస్తాను. అని వెంకట రత్నం గారు అంటారు.

పగటి జీవన పోరాటానికి రాత్రి భూమిక
అమ్మకు నిండైన నిర్వచనం
పగలు రాత్రి పరిశ్రమించే ప్రాణ యంత్రం అమ్మ

అమ్మ శ్రమలో పుట్టి పెరిగి మేల్కొన్న బిడ్డలు చీకటిని రూపుమాపే సూర్యునిలా కాంతిని సంతరించుకుటాడని భావన అమ్మ క్షేత్రాల్లో అమ్మ ఆదిపరాశక్తిలా అనేక అవతారాలెత్తి పనిలో పాలు పంచుకుంటుంది. మన దేశం వ్యవసాయ ప్రధానమైనది. అందుకే కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడి వచ్చింది. మగవానితో పాటు సరిసమానంగా మగువ పనిపాటుల్లో ఎందరో స్త్రీలు అహర్నిశలు శ్రమిస్తున్నారు. పాడిపంటలు పొంగిపొర్లే దారులలో తమ పొట్టపోసుకోవడం తమ పిల్లలను బాగా చదివించి పెద్దవాళ్ళను చేయడం కోసం ప్రయోజకులుగా చేయడం కోసం ఎంతగానో పాటు పడుతున్నారు.

వ్యవసాయం వృత్తిగా గల ఇల్లాలు ఇంటి పనులు చక్కపెట్టుకొని పొలం పనుల్లో చురుగ్గా పాల్గొంటుంది. పంటపొలానికి వెళ్ళి పొలం పని చేస్తుంది తన అమ్మగారు పొద్దుతో పాటు పంటపొలంలోను పనిచేసేది రక్తాన్ని చెమట బిందువులుగా ధారపోసి శ్రమించి అమ్మ నుదుట సింధూరపువ్వులాంటి రంగు కలిగిన కండలతో ముమ్మలను తయారుచేసింది. మొగ్గలకు రెక్కలు అతికించిన అమ్మ మా అందరి కోసం నల్లరేగడి భూమిలో నాగటిచాలులా మారిపోయింది. ఎండల్లో వానల్లో తడిసి తన అందాన్ని ఆరోగ్యాన్ని మా ఉన్నతి కోసం ధారపోసింది. తన జీవితంలో కారు చీకట్లు నింపుకొని మా బతుకుల్లో వెన్నెల పూలు పూయించిన త్యాగ జీవి అమ్మ. అమ్మా ఆకలి అనే వారే తప్ప అమ్మకడుపులో కాసిన ఎర్రటి ఎండలాంటి ఆకలిని పట్టించుకునేదెవ్వరు. అందరూ ఆ తల్లి శ్రమ ఫలితాలను పొందినవారే కాని అమ్మ కష్టాల్లో పాలు పంచుకున్నవారు ఎందరూన్నారని ప్రశ్నిస్తారు అల్లం నారాయణగారు.

పొద్దుతో పాటు
పంటపొలంలో పొడిచేది అమ్మ
చెమట ముత్యాల్లోకి జారి
కత్తిలాంటి మా కండల్లోకి ఇంకేది

అమ్మా! తిన్నావా అని అడిగే బిడ్డలు కావాలి. అమ్మ బతకడానికి ప్రతి బిడ్డా తల్లియొక్క యోగక్షేమాల్లో పాలుపంచుకోవాలి. అప్పుడే అమ్మ ఆనందంగా గౌరవంగా జీవిస్తుంది.

జీవిత సౌధం ఎంత ఎత్తుగా నిర్మించుకున్నప్పటికీ ఆ భవనానికి పునాది అమ్మ శ్రమలోనే గట్టిపడుతుంది. నేడు ఆనంద జీవన తీరాలలో జీవిస్తున్న మన జీవితాలు గాలికి ఆరిపోకుండా దీపం చుట్టూ కట్టిన చేతులు దడి అమ్మ. తన తీపికలలు రూపాలైన పిల్లల కోసం అమ్మ నీళ్ళ

మజ్జిగ తిని పిల్లలకి గడ్డపెరుగును పెడుతుంది. తను పచ్చడి మెతుకులు తిని పిల్లలకి వేపుడు కూర చేస్తుంది. తాను నూనె వేసుకొని పిల్లలకి నెయ్యి వడ్డిస్తుంది. అమ్మ కన్నీరుగా మారి పిల్లలకి ఆనంద బాష్పాలను ఇచ్చింది. అమ్మ ఆలింగనంలో అంతఃకరణం విద్యుత్తేజాన్ని పొందాను అని తన తల్లి గురించి ద్వానా శాస్త్రిగారు చెప్పుకున్నారు.

అమ్మ పొత్తిళ్ళు
నాకళ్ళు తెరపించాయి
అమ్మ పట్టిన ఉగ్గుపాలతోనే
నేను మనిషినయ్యాను

ఇంతటి గొప్పది తల్లి శ్రమ. ఆమె శ్రమలోనే పిల్లల యొక్క ప్రగతి, ఉన్నతి, అభివృద్ధి కలుగుతుంది. అందరికంటే ముందుగా లేచి పిండిరుబ్బుతుంది. పిల్లలను లేపి దీపం దగ్గర కూర్చోపెట్టి వారిని చదువుకి ఉపక్రమింపచేస్తుంది. అమ్మ అన్ని పనులూ యంత్రంలా చేస్తుంది. అలిసి పోయిన అమ్మ మా మస్తిష్కంలో అక్షరమై విచ్చుకుంటుంది. బడి విరామ సమయంలో మామిడి చెట్లక్రింద విప్పిన టిఫిను బాక్సులో నుంచి ఉప్మా వాసనై మా అమ్మ మా కడుపు తడుతుంది. అమ్మ రాత్రి ఎప్పుడు నిద్రపోయేదో కాని కొత్త పుస్తకం వాసనలాంటి అమ్మ పిలుపుతో విద్యార్థులుగా మేల్కొనే వాళ్ళం అని అంటారు ఆప్త చైతన్యగారు.

పెరట్లో
పిండిరుబ్బుతున్న సవ్వడే
మాకు బడి కూతయ్యేది
మేల్కొని ఒళ్ళు విరుచుకొని
బుడ్డీ దీపం ముందు కూర్చుంటే
అమ్మ పుస్తకమై మా ముందు తెరచుకునేది

అమ్మ మాత్రమే హృదయంతో మాట్లాడగలదు. హృదయం ఉన్నవాళ్ళు మాత్రమే అమ్మను స్పృశించగలరు. అమ్మకి అర్థం తెలిసినవాళ్ళు మాత్రమే అమ్మ గొప్పతనాన్ని గ్రహించగలరు. ఆమె శ్రమను గుర్తించగలరు.

అమ్మ మేము నిర్మించుకున్న జీవితాలకు పునాది
గాలికి ఆరిపోకుండా దీపం చుట్టూకట్టిన చేతులదడి
దీపమై తానెన్ని దీపాల్ని వెలిగించింది

ఆర్ద్రత, ఆప్యాయత, అనురాగం అమ్మ మూలధనం. తన జీవితాన్ని ధారపోసి పెంచిన తల్లి రుణం తీర్చుకోవడం మన తల్లి శ్రమకు మనం ఇచ్చే నిజమైన నివాళి.